మధ్యాహ్న భోజనం అధ్వానం

- తినలేకపోతున్న విద్యార్థులు
- ఇంటినుంచి పలువురు క్యారేజీలు
- తాగునీటికీ తప్పని ఇబ్బందులు
- ఇదీ మోడల్, జెడ్పీ హైస్కూల్‌లో దుస్థితి


మోడల్ స్కూల్లో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది


ఇంటి భోజనం తింటున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

నల్లచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మెనూ ప్రకారం భోజనం–పౌష్టికాహారం అందించడంతో పాటు విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటి కోసం ఫిల్టర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాఠశాలల నిర్వహణను గాలికి వదిలేసింది. పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నల్లచెరువులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, దేవిరెడ్డిపల్లి వద్దనున్న ఏపీ మోడల్ స్కూల్‌లో భోజనం రుచికరంగా ఉండటం లేదని విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యంలో నాణ్యత తగ్గింది. ఈ బియ్యంతో అన్నం వండినప్పుడు ముద్దముద్దగా అవుతోంది. మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. కందిపప్పు కిలో రూ.200 దాకా, తెల్లగడ్డలు కిలో రూ.300, ఉల్లిగడ్డలు రూ.50 మేర పలుకుతోంది. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.8.88 చొప్పున చెల్లిస్తున్న ధరతో వంట సమకూర్చడం భోజన ఏజెన్సీ నిర్వాహకులకు తలకు మించిన భారమవుతోంది. దీంతో పప్పు పూర్తిగా పలుచబడిపోవడం.. సాంబారులో కూరగాయలు నామమాత్రం అయిపోవడంతో రుచి మారిపోతోంది. ముద్ద అన్నం.. రుచిలేని కూరలతో భోజనం తినడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు పౌష్టికాహారం కింద అందించే కోడిగుడ్లు సరిపడనన్ని సరఫరా కాకపోవడంతో విద్యార్థులందరికీ అందించలేకపోతున్నారు. జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 524 మంది, మోడల్ స్కూల్‌లో 648 మంది బాలబాలికలు చదువుకుంటున్నారు. బడిలో పెట్టే భోజనం కడుపునిండా తినలేకపోతున్న విద్యార్థులు కొంతసేపటికే నీరసపడిపోతున్నారు. పాఠాలను శ్రద్ధగా వినలేకపోతున్నారు. సగం మంది దాకా విద్యార్థులు ఇంటి నుంచి క్యారియర్లలో భోజనం తెచ్చుకుని తింటున్నారు. నిర్వహణ సరిగా లేక వాటర్‌ప్లాంట్లు పనిచేయడం లేదు. దీంతో తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి. మోడల్ స్కూల్‌లో అయితే ప్లేట్లు శుభ్రం చేయడానికి నీరు లేకపోవడంతో సమీప వ్యవసాయ బోర్ల వద్ద నుంచి బకెట్లలో నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.


ముద్దముద్దగా ఉన్న అన్నం

ఇదిలా ఉండగా మోడల్‌స్కూల్ హాస్టల్‌లో వంద మంది విద్యార్థులు ఉంటున్నారు. కాంపౌండ్ ఉన్నా గేటు ఏర్పాటు చేయలేదు. నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రిపూట మందుబాబులు హాస్టల్ ఆవరణలోకి ప్రవేశిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.


మోడల్ స్కూల్లో మూలనపడ్డ మినరల్ వాటర్ ప్లాంట్ సామగ్రి

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష్మీ కటాక్ష హోమం


హోమం నిర్వహిస్తున్న గురుమాత రమ్యాదేవి

తాడిమర్రి: మండల కేంద్రంలోని కండలిని శక్తిపాత్ సిద్ధ మహాయోగి చౌడేశ్వరి, రమ్యాదేవి ఆశ్రమంలో సోమవారం గురుమాత రమ్యాదేవి నివానందస్వామితో కలసి లక్ష్మీ కటాక్ష నిత్య హోమం, యజ్ఞం నిర్వహించారు. గురుమాత రమ్యాదేవి మాట్లాడుతూ ఆరురోజుల పాటు హోమం నిర్వహించి నవంబర్ 2న గ్రామస్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పైపులైన్ లీకేజీతో నీరు వృథా


లీకేజీ కారణంగా రోడ్డుపై పారుతున్న మంచినీరు

నల్లచెరువు: బాలేపల్లి దిగువ తండాలో పంచాయతీకి సంబంధించిన బోరు వద్ద నుంచి నీటి ట్యాంకు వరకు ఏర్పాటు చేసిన ఇనుప పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. రెండు నెలలుగా మంచినీరు వృథాగా పోతోంది. పక్కనే ఉన్న మురుగునీటితో మంచినీరు కలిసి రోడ్డుపై పారుతోంది. దోమలు పెరిగి విషజ్వరాలు ప్రబలే అవకాశముందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి నరసింహులును వివరణ కోరగా పైప్‌లైన్ అంతా సీసీ రోడ్డుపైనే ఉన్నందున వాహనాలు ఇనుప పైపులైన్‌పై వెళ్లడంతోనే ఈ సమస్య ఏర్పడిందని పేర్కొన్నారు. లీకేజీలను గుర్తించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

బీసీ నేత మృతి బాధాకరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు సాకే రామచంద్ర మృతి బాధాకరమని జిల్లా అధ్యక్షుడు నామాల శంకరయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన రామచంద్ర ఇంటికెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు శంకరయ్య రూ.5వేలు, బీసీ సంక్షేమ సంఘం తరఫున రూ.6 వేలు మొత్తం రూ.11 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, పట్టణ అధ్యక్షుడు బండి వెంకటేష్, నాయకులు జంగమన్న, తిరుపాలు, ఆది, అన్నం లక్ష్మినారాయణ, యోగానంద, రేగాటిపల్లి రవి, వెంకటరాముడు, నాగేంద్ర, నామాల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వారి మాటలు వినొద్దు

బత్తలపల్లి: రెచ్చగొట్టే వారి మాటలు వినవద్దని, సంయమనం పాటించాలని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ వెంకటగారిపల్లి గ్రామస్తులకు సూచించారు. నెల క్రితం వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గీయులు ఘర్షణపడిన విషయం విదితమే. హత్యాయత్నం కింద నమోదైన ఈ కేసులో వైఎస్సార్‌సీపీ వర్గీయులు సబ్ జైలులో ఉంటూ బెయిలుపై బయటకు వచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం సీఐ, ఎస్‌ఐ తమ సిబ్బందితో వేర్వేరుగా గ్రామంలో పర్యటించి ఇరు వర్గాల వారినీ కలిసి గొడవలకు పోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలన్నారు.

లేఅవుట్లకు అనుమతి తప్పనిసరి


యజమానులతో మాట్లాడుతున్న అధికారులు

ఎన్‌పీకుంట: లేఅవుట్లకు అహుడా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఈఓపీఆర్డీ మాధవరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని నల్లగంగమ్మ ఆలయం వద్ద నూతనంగా వేస్తున్న లేఅవుట్‌ను సోమవారం ఈఓపీఆర్డీ పంచాయతీ కార్యదర్శితో కలిసి పరిశీలించారు. లేఅవుట్ యజమానులతో మాట్లాడారు. పంచాయతీ అనుమతితో పాటు అహుడా అనుమతులు పొందిన తరువాతే సరిహద్దు రాళ్లను నాటుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ధర్మవరం రూరల్: రావులచెరువు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు రూరల్ ఏఈ జానకి రామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

నల్లమాడ: మండల కేంద్రంలో సోమవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేజీబీవీ నుంచి ఆర్డీటీ ఏరియా కార్యాలయం వరకు విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సంస్థ డైరెక్టర్ రామేశ్వరి, కదిరి రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, సీఐ నరేంద్రరెడ్డి, ఎస్టీఎల్ రాంప్రతాప్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థినులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

యమ డేంజర్


చారుపల్లి రోడ్డులో ఏపుగా పెరిగిన కంపచెట్లు

నల్లమాడ: గ్రామీణ రోడ్లను కంపచెట్లు కప్పేస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిపోయాయి. మలుపుల వద్ద ఎదుటి వాహనాలు కనిపించడం లేదు. ముఖ్యంగా మండలంలోని చారుపల్లి రోడ్డులో మీసాలపల్లి నుంచి నడింపల్లి వరకు, నల్లమాడ–మలకవేమల రోడ్డు, పాముదుర్తి రోడ్డు, రాగానిపల్లి రోడ్డు, దొన్నికోట రోడ్డు, కొండకమర్ల రోడ్డు, పాతబత్తలపల్లి రోడ్డు, నల్లమాడ–అరవవాండ్లపల్లి తండా రోడ్డులో కంపచెట్లు ఏకంగా రహదారులపైకి విస్తరిస్తున్నాయి. ఇటువంటి చోట్ల ఉన్నపళంగా ఎదురుగా వాహనాలు కనిపించేసరికి వేగం నియంత్రించలేక పలు వాహనాలు ఢీకొంటున్నాయి. రెండు నెలల క్రితం చారుపల్లి సమీపాన కారు ఢీకొని వంకరకుంట గ్రామానికి చెందిన రమణారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లమాడ–రెడ్డిపల్లి, నల్లమాడ–ఎద్దులవాండ్లపల్లి తండా, చౌటకుంటపల్లి–శేషయ్యగారిపల్లి, పులగంపల్లి–ముత్యాలచెరువు రహదారుల్లో గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగి.. పలువురు ప్రాణాలు కోల్పోయిన దాఖలాలు ఉన్నాయి.

రేపు మండల సమావేశం

పుట్టపర్తి: బుక్కపట్నం మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, కార్మికులు

ధర్మవరం అర్బన్: మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో కన్వీనర్ అయూబ్‌ఖాన్, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ధర్మవరం నాయకులు బాబు, ముకుంద మాట్లాడుతూ పట్టణంలో జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, మృతి చెందిన కార్మిక కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యలు పరిష్కరించాలని, ఈఎస్‌ఐ ఆస్పత్రిని ధర్మవరంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలను ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం జీతాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బొగ్గు నాగరాజు, అనిల్, లక్ష్మీ ఓబిలేసు, ప్రసాద్, పెద్దక్క, మంజు, చంద్ర, రమేష్, పెద్దన్న, ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, క్లాప్ డ్రైవర్లు, కోవిడ్ కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల ర్యాలీ

కదిరిటౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జనార్ధన, బాలకృష్ణ, తిరుపాల్, నరసింహమూర్తి, సీఐటీయూ నాయకులు జి.ఎల్.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తగిన జాగ్రత్తలతో టపాసులు విక్రయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: దీపావళి పండుగ సందర్భంగా అగ్నిప్రమాదాలు జరగకుండా టపాసులు విక్రయించాలని ఆర్డీఓ మహేష్ తెలిపారు. ఆర్డీఓ సమావేశ భవనంలో సోమవారం పోలీసు అధికారులు, టపాసుల లైసెన్సు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టపాసుల విక్రయాలు చేస్తున్నారన్నారు. ప్రమాదాలు, సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత విక్రయదారులపై ఉందన్నారు. టపాసుల విక్రయించే దుకాణానికి మరొక దుకాణానికి మూడు అడుగుల దూరం ఉండాలని తెలిపారు. టపాసుల స్టాక్‌ను పట్టణానికి దూరంగా గోడౌన్, ప్రత్యేకమైన గదులలో భద్రపరచాలన్నారు. అగ్గిపెట్టె, కిరోసిన్, పెట్రోల్ లాంటి పేలుడుకు సంబంధించిన వస్తువులు టపాసు దుకాణాల వద్ద ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఫైరింజన్‌తోపాటు అగ్నిమాపక సిబ్బంది, ప్రథమ చికిత్స కేంద్రం అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి లైసెన్సు టపాసుల విక్రయదారుడు విద్యుత్, ఫైర్, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో తప్పక అనుమతి తీసుకోవాలని సూచించారు. డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో మొత్తం 20 మంది మాత్రమే టపాసుల విక్రయానికి అనుమతి పొందారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ నటరాజ్, ఫైర్ ఆఫీసర్ రాజు, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, టూటౌన్ సీఐ రెడ్డప్ప, ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామరావు, డీఏఓ ఖతిజున్‌కుబ్రా, తహసీల్దార్లు స్వర్ణలత, నారాయణస్వామి, సురేష్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

తాడిమర్రి: టపాసుల అమ్మకంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ కృష్ణవేణి దుకాణదారులను హెచ్చరించారు. తాడిమర్రి పోలీసుస్టేషన్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ టపాసుల విక్రయం లైసెన్స్ పొందిన వారు మాత్రమే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాలను పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేయాలన్నారు.

నిబంధనలు పాటించాలి

కదిరి అర్బన్: టపాసుల విక్రయదారులు నిబంధనలు పాటించాలని ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ సూచించారు. సోమవారం కదిరి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓతో పాటు మున్సిపల్ కమిషనర్ కిరణ్ టపాసుల విక్రేతలతో సమావేశం నిర్వహించారు. నిబంధనల మేరకు టపాసుల విక్రయాలు జరగాలన్నారు. సమావేశంలో సీఐ నారాయణరెడ్డి, ఫైర్ ఆఫీసర్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాంను పరిశీలించిన స్పానిష్ బృందం



బత్తలపల్లి: అప్పరాచెరువు పంచాయతీ పరిధిలోని సంగమేశ్వర క్షేత్రం వద్ద చిత్రావతి నదిపై ఆర్డీటీ సహకారంతో రూ.1.86 కోట్లతో నిర్మించిన రోడ్డు కమ్ చెక్‌డ్యాంను స్పానిష్ బృందం సభ్యులు డివిగో, అలెక్స్, వురియల్, బేగోత, డైరెక్టర్ భీమలింగప్ప, ట్రాన్స్‌లేటర్ నిర్మల తదితరులు సోమవారం పరిశీలించారు. రోడ్డు కమ్ చెక్‌డ్యాం నిర్మాణంతో చిత్రావతి నది పరివాహక ప్రాంతాల్లోని ఏడెనిమిది గ్రామాల ప్రజల రాకపోకలతో పాటు భూగర్భజలాలు భారీగా పెరిగే అవకాశం ఉందని వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి వివరించారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఈశ్వరయ్య, లింగమయ్య, నారాయణస్వామి పాల్గొన్నారు.

పుట్టపర్తిని పరిశుభ్రంగా ఉంచుదాం


చిత్రావతి నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని చిత్రావతి నది పరివాహక ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాదతో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా జన్మదిన వేడుకలు నవంబర్‌లో ప్రారంభమవుతాయని, భక్తులకు ఇబ్బందుల లేకుండా మౌలిక సదుపాయలు కల్పించడమూ కాక పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నది పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం 1, 2 సచివాలయాలను తనిఖీ చేశారు.

విస్తృతంగా ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలు


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి

పుట్టపర్తి అర్బన్: హెచ్‌ఐవీ/ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని డీఎంహెచ్‌ఓ మంజువాణి ఆదేశించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం పీఎంపీఎస్‌ఈపై కమ్యూనిటీ అడ్వయిజరీ సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ హెచ్‌ఐవీ రహిత జిల్లాగా చేపట్టడానికి తగిన నియంత్రణ కార్యక్రమాలను అన్ని స్వచ్ఛంద సంస్థలూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. క్లస్టర్ ప్రోగ్రాం అధికారి భాస్కర్, డాక్టర్ గాయత్రి, ఏఆర్టీ సెంటర్, ఐసీటీసీ యూనిట్స్ మేనేజర్లు, చైల్డ్ ఫండ్ ఇండియా కమిటీ సభ్యులు పాల్గొని తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు ఆంజనేయులు, అశోక్, తిప్పేస్వామి, నవీన్, శ్రీనివాసులు, డీఆర్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధులకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న శాలిబాయి, సామ్లానాయక్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వృద్ధులకు తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నేకొత్తపల్లి మండలం ఎర్రంపల్లికి చెందిన సామ్లానాయక్, శాలిబాయి దంపతులు టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌పై ధర్మవరం వస్తుండగా ఎర్రగుంట సమీపంలో మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సామ్లానాయక్, శాలిబాయి తీవ్రంగా గాయపడ్డారు. వీరికి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.సుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

ఎల్‌పీఎం సమస్యలపై ఏడు అర్జీలు

అమడగూరు: జాయింట్ ఎల్‌పీఎంల సమస్యల పరిష్కారానికి సోమవారం చీకిరేవులపల్లి పంచాయతీలో రెవెన్యూ అధికారులు నిర్వహించిన గ్రామ సభలో ఏడు అర్జీలు వచ్చాయి. వీటిని పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

చెన్నేకొత్తపల్లి: కనుముక్కల గ్రామానికి చెందిన ఓ మహిళ సోమవారం ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు.. గ్రామానికి చెందిన నేలకోటప్ప ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి భార్య పావని మనోవేదనతో బాధపడుతోంది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పావని విషద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది.

నైపుణ్య సర్వేపై నేడు శిక్షణ

ముదిగుబ్బ: గ్రామాలలో ఇంటింటా నైపుణ్య సర్వేకు సంబంధించి మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ తెలిపారు. సచివాలయ సిబ్బంది హాజరు కావాలన్నారు.

ప్రశాంతంగా జీవించండి

ధర్మవరం రూరల్: గ్రామస్తులు ప్రశాంత వాతావరణంలో జీవించాలని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. సోమవారం రాత్రి ఆయన తన సిబ్బందితో కలిసి పోతులనాగేపల్లిని సందర్శించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు.

ప్రతి ఇంట్లో జ్ఞాన జ్యోతులు వెలగాలి

ధర్మవరం రూరల్: దీపావళి సందర్భంగా ప్రతి ఇంట్లోనూ జ్ఞాన జ్యోతులు వెలగాలని త్రైత సిద్ధాంత సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గొల్లపల్లి, బడన్నపల్లి, గుట్టకిందపల్లి తదితర గ్రామాల్లో వారు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేపట్టారు.

నూడుల్స్ చేస్తుండగా బాలుడికి గాయాలు

ధర్మవరం అర్బన్: గ్యాస్ స్టౌపై నూడుల్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ బాలుడికి గాయాలయ్యాయి. ధర్మవరం పట్టణంలోని కొత్తపేటకు చెందిన పెయింటర్ రషీద్ కుమారుడు, ఏడో తరగతి చదువుతున్న ఖాజావలి సోమవారం సాయంత్రం గ్యాస్ స్టౌపై మ్యాగీ నూడుల్స్ చేసుకుంటుండగా చేయి తగిలి పక్కనే ఉన్న టర్పెంటైన్ ఆయిల్ బాటిల్ కిందపడి ఒలికింది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఖాజావలికి స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

రామగిరి: ఎంసి.పల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మాల శ్రీనివాసులు (48) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య సాలమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సర్పంచ్ సిద్దన్న, మండల అగ్రిబోర్డ్ చైర్మన్ నరసింహారెడ్డి తదితరులు శ్రీనివాసులు మృతదేహానికి నివాళులర్పించారు.

రక్తదానం.. సంతోషదాయకం

ఓడీచెరువు : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం ఓడీ చెరువు మండలం నుంచి 25 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయడం సంతోషదాయకమని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

పుట్టపర్తి: బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వలంటీర్లు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఏఎస్‌ఐ మస్తాన్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ఓబిలేసు పాల్గొన్నారు.

అమడగూరు: మహమ్మదాబాద్‌కు చెందిన 18 మంది యువకులు అమడగూరు ఎస్‌ఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సోమవారం పుట్టపర్తిలో రక్తదానం చేశారు. రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేశారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

నల్లమాడ: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) సత్యనారాయణ సూచించారు. సోమవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడీఏ పాల్గొని సమాచార హక్కు చట్టంపై రైతు సేవ సహాయకులకు అవగాహన కల్పించారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ ఆయా మృతి


రామకృష్ణమ్మ(ఫైల్)

ముదిగుబ్బ: అంగన్‌వాడీ ఆయా గుండెపోటుతో మృతి చెందింది. నల్లచెర్లోపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం విధి నిర్వహణలో ఉన్న ఆయా రామకృష్ణమ్మ (55) ఉన్నపళంగా ఛాతీలో నొప్పి అంటూనే కుప్పకూలింది. వెంటనే స్థానికులు అప్రమత్తమై ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందింది. ఈమెకు భర్త, కూతురు ఉన్నారు.

ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నాగమణి


నియామక పత్రాన్ని అందుకుంటున్న నాగమణి

కదిరి అర్బన్: ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా కదిరి మండలం పట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం స్టాఫ్‌నర్సు నాగమణిని ఎన్నుకున్నారు. ఆదివారం విజయవాడలోరాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నాగమణి సోమవారం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో నర్సులు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా 24 గంటలూ పని చేస్తున్న ఆస్పత్రుల్లో ముగ్గురు స్టాఫ్‌నర్సులు మాత్రమే ఉన్నారని చెప్పారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నందున అదనంగా మరొక స్టాఫ్‌నర్సును నియమించాలని చెప్పారు. రాత్రి షిఫ్టుల్లో వాచ్‌మెన్‌ను నియమించాలన్నారు. నర్సు హోదాను సూచించే పేర్లు మార్చాలన్నారు.

'అపార్'లో నమోదు తప్పనిసరి

చెన్నేకొత్తపల్లి: పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)లో నమోదు చేయాలని మండల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు మున్వర్ బాషా, ప్రసూన్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానంలో భాగంగా ఆధార్ తరహాలో ఉంటే అపార్ కార్డులను విద్యార్థులకు అందిస్తారని తెలిపారు. ఇందులో విద్యార్థి డేటా నిక్షిప్తమై ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థి ఆధార్ కార్డు నంబర్, స్కూల్ రికార్డ్, యూడైస్‌లో అపార్ ఆన్‌లైన్ ఫారంలో నింపాలన్నారు. వీటిని తప్పులు లేకుండా త్వరగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అశోక్ కుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంత.. ప్రయాణానికి చింత


ఎన్‌పీకుంట తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు


ఓడీచెరువులోని మెయిన్ రోడ్డులో నీటి గుంతలు

ఓడీచెరువు : మండల కేంద్రం ఓడీ చెరువులోని ప్రధాన రహదారి అధ్వాన స్థితికి చేరింది. పలు చోట్ల కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను తప్పిస్తూ వాహనాలు నడపాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. దీనికితోడు పైపులైన్ల లీకేజీతో వచ్చే నీరు గుంతల్లోకి చేరుతోంది. రోజులతరబడి నిల్వ ఉన్న నీరు దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు రోడ్డు పాడైపోయిన కారణంగా వాహనాల రాకపోకల సమయంలో దుమ్మురేగుతోంది.

గోతులు పూడ్చండి

ఎన్‌పీకుంట: ఇటీవల కురిసిన వర్షాలకు మండల కేంద్రం ఎన్‌పీకుంటలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద, ధనియానిచెరువు సమీపంలోని కదిరి–రాయచోటి రోడ్లపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అందులో వర్షపునీరు నిలిచి ఉండడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొత్త రోడ్డు వేసే లోపు తాత్కాలికంగా గోతులు పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.